ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY







# కొండను తవ్వారుగాని..

అవినీతిని బయటపెట్టని సామాజిక తనిఖీ బృందం

13 రోజుల పాటు కొనసాగిన తనిఖీ

ఉపాధి హామీ పథకంలో ఉద్యాన తోటలు ఉన్నట్లేనా?

విచారణలో నిర్లక్ష్యంపై విమర్శలు

**రుద్రవరం, సెప్టెంబరు 23 :** ఉపాధి హామీ పథకం పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించే ప్రక్రియను సామాజిక తనిఖీ అంటారు. గ్రామ స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలు ఎట్లా అమలవుతున్నదీ నిష్పాక్షికంగా తనిఖీ చేసి వాస్తవాలను వెలికి తీయాలి. ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులు, చేసిన పనులు సమానంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించాలి. ఇంత ప్రధానమైన ఈ ప్రక్రియ సవ్యంగా జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. సామాజిక తనిఖీ బృందం రుద్రవరం మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన పనులపై గత నెల 13 నుంచి 29 వరకు అన్ని పంచాయతీల పరిధిలో సామాజిక తనిఖీ బృందం ఆడిట్ నిర్వహించింది. అయితే అధికారులు రైతులను సంప్రదించకుండా ఫీల్డ్ అసిస్టెంటు చూపినవి రాసుకొని వెళ్లిపోయారనే విమర్శలు ఉన్నాయి. ఒక ఎస్ఆర్పీ, 10 మంది డీఆర్పీలు, 11 మంది వీఎస్ఏలు సామాజిక తనికీ చేసి కొండను తవ్వి ఎలుకను పట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పనుల్లో చనిపోయిన వారికి, ప్రైవేటు ఉద్యోగులకు పని దినాలు కల్పించారని, ఇవేవీ తనిఖీలో పట్టించుకోలేదని అంటున్నారు.

రుద్రవరం మండలంలో రూ.9.96 కోట్లతో ఉపాధి పనులు చేశారు. సచివాలయ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. అయితే సచివాలయ భవనాలు, రోడ్లు పగుళ్ల ఇచ్చాయి. సామాజిక తనిఖీ బృందానికి ఇలాంటివి కనిపించవా అనే విమర్శలు గ్రామాల్లో ఉన్నాయి. సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఇళ్లల్లో కూర్చుని సర్వే చేశారన్న విమర్శలున్నాయి. నిజాయితీగా, నిర్భయంగా పనిచేసేవారిని ఈ బృందాల్లోకి ఎంపిక చేయాలి. అప్పుడే ఉపాధి పనుల్లో అవినీతి బయటపడుతుంది.



రుద్రవరంలో విచారణ చేపట్టిన సామాజిక తనిఖీ బృందం (ఫైల్)

## 15 రోజుల పాటు 20 మంది ఏం చేశారు?

రుద్రవరం మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1279 పనులకు గాను రూ. 9,92, 64,136 విలువ గల పనులు చేశారు. 20 మంది సామాజిక తనిఖీ బృందం 13 రోజుల పాటు తనిఖీ చేసి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానా రూ.7500, రికవరీ రూ.98,382, విచారణ పేరుతో రూ. 3,22,304, రీస్టాంపేషన్‌తో రూ.13,16,228 అని తేల్చారు. కానీ అవినీతి మాత్రం బయటికి తీయడంలో సామాజిక బృందం విఫలమైనట్లు విమర్శలున్నాయి. జాబ్ కార్డులకు డబ్బులు వసూలు చేసిన సంగతి పట్టించుకోలేదు.

## రికవరీ ఇలా..

యల్లావత్తులో రూ.1,470, బీరవోలులో రూ.2,160, డి. కొట్టాలలో 1,053, హరినగరంలో రూ.461, కోటకొండలో రూ.1,592, చిన్నకంబలూరులో రూ.2,150, ఎర్రగుడిదిన్నెలో రూ.9,908, చందలూరులో రూ.1,566, చిన్న కంబలూరులో రూ.20,194, టి.లింగందిన్నెలో రూ.973, ముత్తలూరులో రూ.998, నాగులవరంలో రూ.682, పేరూరులో రూ.6,032, ఆలమూరులో రూ.10,124, మందలూరులో రూ.6,019, రుద్రవరంలో రూ.29,396 రికవరీ చేయాలని తనిఖీ బృందం తేల్చింది. వీటిలో జరిమానా మందలూరులో రూ.1,000, శ్రీరంగాపురంలో రూ.500, యల్లావత్తులలో రూ.4వేలు, పెద్దకంబలూరులో రూ.1,500, కోటకొండలో రూ.500గా జరిమానా విధించారు.

## అధికారులు ఏం చేస్తున్నట్లు?

పీవో, ఏపీవో జీసీ అధికారులు ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణపై క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. చనిపోయినవారికి పనిదినాలు కల్పించినప్పుడు ప్రైవేటు ఉద్యోగస్తులకు పనిదినాలు కల్పించినప్పుడు పరిశీలించడంలో నిర్లక్ష్యం వహించినట్లు తేట తెల్లమైంది. కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు చేస్తుంటే పర్యవేక్షణలో అవకతవకలు జరిగాయని పల్లెల్లో విమర్శలున్నాయి.

## రైతులను పిలవకుండానే సామాజిక తనిఖీ


ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన తోటలు సాగు చేసిన రైతులను పిలవకుండానే సామాజిక తనిఖీ బృందం తోటలను పరిశీలించడంలో విమర్శలున్నాయి. రైతులను పిలిస్తే కదా తోటలు ఉండేవి లేనిది తెలుస్తుంది. ఫీల్డ్ అసిస్టెంట్లు సూచించింది తోట సామాజిక బృందం జాబితాలో నమోదు చేసిందే తోటగా మారింది. ఉద్యాన తోటలు ఉన్నట్లా? లేనట్లా అనే విమర్శలున్నాయి. గ్రామాల వారీగా రైతులను విచారిస్తే నిజానిజాలు బయటపడే అవకాశం ఉంది. అధిక సంఖ్యలో బోగస్ అని తేలే అవకాశం ఉందని రైతుల్లో చర్చ కొనసాగుతోంది

## విచారణలో నిర్లక్ష్యం ఎందుకు?

ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై పీడీ రామచంద్రరెడ్డి, ఆగస్టు 29న బహిరంగ చర్చ వేదిక నిర్వహించారు. విచారణ అధికారిగా ఏపీడీ సాంబశివరావును నియమించారు. విచారణలో నిర్లక్ష్యం ఎందుకన్న విమర్శలు ఉన్నాయి. 14 రోజులు గడిచినా ఒక గ్రామాన్నే విచారించి మిగిలిన గ్రామాలను విచారించకపోవడంలో ఆంతర్యమేమిటి అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## అధికారుల సలహాతోనే ఫీల్డ్ అసిస్టెంటు రాజీనామా

ఉపాధి హామీ పథకం అధికారుల సలహాతోనే ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారు. సామాజిక తనిఖీలో భాగంగా వెలుగు చూసిన అవినీతి అక్రమాలు తమకు ఎక్కడ చుట్టుకుంటాయో అని ముందస్తు అధికారులే ఫీల్డ్ అసిస్టెంట్లతో రాజీనామా చేయించారు. నలుగురు రాజీనామా చేశారు. ఎక్కడ తాము చేసిన అక్రమాలు బయట పడతాయోనని ముందస్తు రాజీనామా చేయించారన్న విమర్శలు ఉన్నాయి.






## ఆలమూరులో విచారణ

ఆలమూరు గ్రామంలో ఉపాధి పనులపై ఏపీడీ సాంబశివరావు విచారణ చేశారు. మిగిలిన గ్రామాల్లో విచారణ చేయాల్సి ఉంది. మండలంలో నిర్వహించాల్సిన ఉపాధి పనులు పంచాయతీరాజ్ పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించి నివేదికలు ఇచ్చింది. ఈ నివేదికలనే ఉన్నతాధికారులు బహిరంగ చర్చా వేదికలో వినిపించారు.

- ప్రతాప్, ఏపీవో, రుద్రవరం



ఆలమూరులో ఉపాధి పథకం కింద నిర్మించిన సీసీ రోడ్డు పగుళ్లు ఏర్పడిన దృశ్యం

# ధర పలకని వంకాయలు

రైతుకు రూ.4 లక్షల నష్టం



శెట్టివీడు రహదారిపై పడేసిన వంకాయలు

**చాగలమర్రి, సెప్టెంబరు 23:** చాగలమర్రి గ్రామంలో రైతు నాగరాజు నెల్లూరు రకం వంకాయలను సాగు చేసి భారీగా నష్టపోయాడు. నెల్లూరు రకం వంకాయలు దిగుబడి బాగా వస్తుందని ఆశించి సాగు చేశాడు. పంట చేతికొచ్చేసరికి వాతావరణంలో మార్పుల వల్ల తెగుళ్లతో వంకాయలకు పురుగు పట్టింది. మరో పక్క ధర ఒక్కసారిగా పడిపోవడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. నాలుగు ఎకరాల్లో వంకాయ సాగు చేయడానికి రూ.4.05 లక్షలు పెట్టుబడి పెట్టాడు. కేజీ రూ.10 మాత్రమే పలుకుతున్నందు వల్ల రవాణా, కూలీ ఖర్చులు కూడా రావని వంకాయలు కోసి రహదారుల వెంట పడేశాడు. గొర్రెలు, మేకలు, పశువులకు మేతగా వంకాయలు మారాయి. దాదాపు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వ ఆదుకోవాలని కోరుతున్నాడు.

# స్వర్ణాంధ్ర- 2047కు ప్రణాళికలు రూపొందించండి

క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించండి: కలెక్టర్ రాజకుమారి




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

**నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 23:** స్వర్ణాంధ్ర 2047 దార్శనిక పత్ర రూపకల్పనలో భాగంగా జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో పీజీఆర్ఎస్ వేదికలో భాగంగా స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని కీలక రంగాలపైన దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో గ్రామ సభలు నిర్వహించి స్వర్ణాంధ్ర 2047 విజన్ అభివృద్ధి రూపకల్పనపై చర్చించడంతో పాటు కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ఇంటింటికి సమాచారం అందించి అవగాహన కల్పించాలన్నారు. రానున్న 5 సంవత్సరాలలో జిల్లా అభివృద్ధి ప్రణాళికలను ఈ నెల 30వ తేదీలోగా రూపొందించాలన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర - 2047 పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# సత్వర పరిష్కారం చూపండి

కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 23:** ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రజా వినతులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. జేసీ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 357 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. జిల్లాలో 90 శాతం ఈ ఆఫీస్ ద్వారానే ఫైల్స్ పంపిస్తున్నారని డివిజన్, మండల స్థాయిలో కూడా 15 రోజుల్లో ఈ ఆఫీస్ ద్వారానే దస్త్రాలు రావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమస్యలన్నీ విథిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 135 అర్జీలు



ఫిర్యాదుదారురాలితో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

**నంద్యాల క్రైం, సెప్టెంబరు 23 :** నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 135 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడుతూ చట్టపరిధిలో ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒకసారి వచ్చిన సమస్య మళ్లీ పునరావృతం కాకూడదన్నారు. కార్యక్రమంలో సివిల్ తగాదాలు, అత్తింటి వేధింపులు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తిపంపకాల్లో మనస్పర్థలు తదితరాలున్నాయి. ఈ కార్యక్రమంలో సీఐలు మోహన్‌రెడ్డి, ఏరిషావలి, ఆదినారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రియతమ్‌రెడ్డి, యువరాజు, సురేష్, సీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

**రుద్రవరం, సెప్టెంబరు 23 :** 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. టీడీపీ ప్రభుత్వం రైతు నేస్తాలుగా పిలువబడే రెండు కార్యక్రమాలకు సీఎం చంద్రబాబునాయుడు మళ్లీ ప్రాణం పోసి ప్రారంభించారు. ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం ఈ రెండు పథకాలను పక్కనపెట్టి రైతులకు సలహాలు సూచనలు కరువయ్యేలా చేసింది. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఈ రెండు పథకాలను కొనసాగించింది. వైసీపీ ప్రభుత్వం 2019-24 సమయంలో ఈ రెండు పథకాలను నిర్వీర్యం చేసింది. ఈ క్రమంలో తాజాగా మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పొలం బడి, పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వ్యవసాయశాఖాధికారులు పొలం వద్దనే వారానికి ఒకరోజు పొలం బడి నిర్వహించి రైతులకు వ్యవసాయశాఖ సలహాలు సూచనలు అందిస్తారు. రైతు సమస్యలను తెలుసుకుని మరీ సలహాలు సూచనలు ఇవ్వడమే పొలం బడి లక్ష్యం. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులతో కలసి గ్రామాల్లో సందర్శిస్తారు. రైతులతో కలసి చర్చాగోష్టి కార్యక్రమం నిర్వహిస్తారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చేపట్టాల్సిన, అనుసరించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను ఆయా శాఖల అధికారులు రైతులకు తెలియజేస్తారు. ఈ సారి సెప్టెంబరు 3,4 తేదీల్లో ప్రారంభం కావాల్సి ఉండగా సెప్టెంబరు 24 నుంచి ప్రారంభం అవుతున్నట్లు వ్యవసాయాదికారులు తెలిపారు. పొలంబడి, పొలం పిలుస్తోంది రెండు కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని రుద్రవరం మండల ఏఓ శ్రీకృష్ణ వెల్లడించారు.



# తిరుమలను అపవిత్రం చేసే కుట్ర

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 23:** తిరుపతి, తిరుమల ఖ్యాతిని అపవిత్రం చేసి.. అక్కడకు ఎవరూ వెళ్లకుండా చేయాలని జగన్ బ్యాచ్ కుట్ర చేసిందని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఆరోపించారు. సోమవారం నగరంలోని బైరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి లాంటి వ్యక్తులకు కీలక బాధ్యతలు అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టినప్పటి విజయనగరం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, మంత్రాలయం వరకు వందల ఆలయాలు, విగ్రహాలను జగన్ బ్యాచ్ ధ్వంసం చేసిందని ఆరోపించారు. వీటన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఏడు కొండలపై జీవో వివాదాస్పద జీవోను జారీ చేశాడని, ఆ అంశాన్ని వెలుగులోకి తెచ్చింది తానేనన్నారు. జగన్మోహన్‌రెడ్డి అన్యమతస్థుడన్నారు. తిరుమల లడ్డూ విషయంలో జగన్ మహాపచారం చేశాడన్నారు. ఇలాంటి దుర్మార్గులు మరోసారి అధికారంలోకి వచ్చి ఉంటే వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని తీసేసి ఆ స్థానంలో వైఎస్ విగ్రహం పెట్టేవారేమోనని సందేహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు వేములశ్రీధర్, నారాయణరెడ్డి, కాకర వాడ చిన్న వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి

# విద్యుత్‌శాఖలో 129 మందికి బదిలీ

**కల్లూరు, సెప్టెంబరు 23:** 2024-25 జనరల్ బదిలీల్లో భాగంగా నిబంధనల మేరకు విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం. ఉమాపతి ఉద్యోగులకు బదిలీ ఆర్డర్లను జారీ చేశారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు గైడ్‌లెన్స్ ప్రకారం ఉమ్మడి కర్నూలు సర్కిల్‌లోని అకౌంట్స్, ఇంజనీర్లు, సీనియర్ అసిస్టెంట్ దిగువ స్థాయి ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చామని ఎస్ఈ స్పష్టం చేశారు. మ్యూచ్‌వల్, ఐదేళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులు, మెడికల్ గ్రౌండ్ కింద ఇచ్చిన అభ్యర్థనలను పరిగణలోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా మొత్తం 129 మందికి బదిలీ ఆర్డర్లు ఇవ్వగా ఏఈఈ, ఏఈ-22, జేఈ-24, జేఏఓ-7, సీనియర్ అసిస్టెంట్-49, జూనియమయర్ అసిస్టెంట్-17, టైపిస్ట్-2, ఓఎస్ఓ-1, జేఎల్ఎం గ్రేడ్-2-6, వాచ్‌మన్-1 ఉన్నాయని ఎస్ఈ యం ఉమాపతి తెలిపారు. అదేవిధంగా తిరుపతి కార్పొరేట్ ఆఫీసు నుండి సీఎండీ సంతోషరావు పలువురు ఏఈలు, ఏడీఈలు, డీఈలకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు.

# శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో

కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి



నిండు కుండలా శ్రీశైలం జలాశయం

**శ్రీశైలం, సెప్టెంబరు 23:** శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి సోమవారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. జూరాల నుంచి 16,200 క్యూసెక్కులు వరద నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 875.20 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 164.7532 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 25,629 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

## పోలీసు శాఖలో హోంగార్డులు కీలకం

### హోంగార్డు కమాండెంట్ మహేష్



హోంగార్డులతో మాట్లాడుతున్న కమాండెంట్ మహేష్

**కర్నూలు, సెప్టెంబరు 23:** పోలీసు శాఖలో అన్ని విభాగాల్లో హోంగార్డులు చాలా కీలకమని హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై హోంగార్డులతో మాట్లాడారు. హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విధుల్లో నైపుణ్యం పెంచుకోవాలని, జీవీత బీమా పాలసీలు చేయించుకోవాలని సూచించారు. హోంగార్డు డీఎస్పీ కృష్ణమోహన్, ఆర్ఐ జావీద్ తదితరులు ఉన్నారు.

## జగన్‌ను అరెస్టు చేయాలి

### ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

**కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 23:** తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడి మాజీ సీఎం జగన్ ఘోరమైన తప్పిదం చేశారని, ఆయనను తక్షణమే అరెస్టు చేయాలని ఆదోని శాసనసభ్యుడు డాక్టర్ పార్థసారథి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుమల లడ్డూ వందల కోట్ల హిందువులకు పవిత్ర ప్రసాదమని, దీనిని అపవిత్రం చేసిన జగన్‌తో పాటు అప్పటి టీటీడీ ఛైర్మన్లు భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సూర్యప్రకాష్, యోగానంద్ చౌదరి, నగరూరు రాఘవేంద్ర, సాయిప్రదీప్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## 68వ స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభం



స్కూల్‌గేమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ రవికృష్ణ

**నంద్యాల రూరల్, సెప్టెంబరు 23 :** కర్నూలు, నంద్యాల జిల్లాల 68వ జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు నంద్యాలలో కేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ రవికృష్ణ, నంద్యాల డిప్యూటీ ఈవో మహబూబ్‌బేగ్, నంద్యాల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శివకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాల, బాలికలకు రెజ్లింగ్, రోప్స్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్, బాల్ బాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 600మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శివప్రసాద్, హెచ్ఎం అసదుల్లా, లక్ష్మయ్య, జిల్లా పీఈటీ అండ్ పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

## నేటి నుంచి బీఈడీ సెమిస్టర్

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 23:** రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 24 నుంచి 29 వరకు బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రెగ్యులర్ 2871, సప్లిమెంటరీకి 410 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. పరీక్షలు ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 3:30 వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని ఆయన సూచించారు.

## జిల్లాలో పలువురు ఏపీపీల బదిలీ

**కర్నూలు(లీగల్), సెప్టెంబరు 23:** జిల్లాలో పని చేస్తున్న పలువురు ఏపీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాలు జారీ చేశారు. ఆలూరు ఏపీపీగా నందికొట్కూరులో ఏపీపీగా పని చేస్తున్న రమాకిషోర్‌ను ఆలూరులో పని చేస్తున్న భాస్కర్‌ను డోన్ ఏపీపీగా బదిలీ చేశారు. నందికొట్కూరు ఏపీపీగా కర్నూలు మొబైల్ కోర్టులో ఏపీపీగా పని చేస్తున్న సుష్మితను కర్నూలులో జువైనల్ కోర్టు ఏపీపీగా పని చేస్తున్న సుబ్బయ్యను ఆళ్లగడ్డకు బదిలీ చేశారు. కర్నూలు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ ఖాదర్‌బాషాకు కర్నూలు జువైనల్ కోర్టు ఏపీపీగా కూడా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఎమ్మిగనూరులో పనిచేస్తున్న గోపాలకృష్ణను కర్నూలు ఎక్సైజ్ కోర్టుకు ఆళ్లగడ్డలో పని చేస్తున్న అనిల్ కుమార్‌ను కర్నూలు మొబైల్ కోర్టుకు డోన్‌లో పని చేస్తున్న పద్మజను కదిరి కోర్టుకు కర్నూలు ఎక్సైజ్ కోర్టులో పని చేస్తున్న విష్ణువర్ధన్‌ను పలమనేరు కోర్టుకు బదిలీ చేశారు.

## గృహ నిర్మాణ శాఖలో...

**కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 23:** గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధలింగమూర్తి బదిలీ అయ్యారు. సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. పంచాయితీరాజ్‌శాఖలో డీఎల్‌పీవోగా పని చేస్తున్న ఈయనను పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు. దీంతో పాటు ఆదోని డివిజన్‌లో ఈఈగా పని చేస్తున్న రవికుమార్‌ను ప్రకాశం జిల్లాకు మదనపల్లిలో ఈఈగా పని చేస్తున్న వెంకటదాసును కర్నూలుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

## డీఎస్‌వోగా రఘువీరా

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23:** డీఎస్‌వోగా రఘువీరా నియమితులయ్యారు. ప్రస్తుతం పని చేస్తున్న డీఎస్‌వో ప్రసాద్ రాజమండ్రికి బదిలీ అయ్యారు. భూసర్వే శాఖలో 65 మంది బదిలీ అయ్యారు. డీఆర్‌డీఏ శాఖలో 70 మంది బదిలీ అయ్యారు.


## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

### ఒకరి పరిస్థితి విషమం

**హొళగుంద, సెప్టెంబరు 23 :** రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో ఖలందర్ అనే వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. హొళగుంద మండలం మార్లమాడికి రోడ్డులోని బాదర్‌సాబ్ టీపీ వద్ద ఈ సంఘటన జరిగింది. హొళగుందలోని దిడ్డి కాలానికి చెందిన సిద్ధప్ప కర్ణాటకలోని మాటేసుగురు గ్రామంలో పనులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా, హొళగుందకు చెందిన ఖలంధర్, అతని స్నేహితుడు కాలేసాబ్ హొళగుంద నుండి కర్ణాటకలోని భూదుగుంప్ప గ్రామానికి వెళ్తుండగా మురళి రైస్ మిల్లు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఖలందర్ ఎడమ కాలు విరిగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో బళ్లారిలోని ఓపీడీ ఆస్పత్రికి తరలించారు. కాలేసాబ్‌కు కుడి కాలుకు తీవ్ర గాయమైంది. సిద్ధప్ప తలకు, కాలికి గాయమైంది. వీరికి హొళగుంద పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, ఆదోనిలోని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

# కర్నూలులో హైకోర్టు బెంచ్..!

● సుముఖత వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు ● న్యాయవాదుల హర్షం



**కర్నూలు లీగల్/ కర్నూలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు త్వరలోనే మంత్రివర్గ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపుతామని సీఎం చంద్రబాబు సోమవారం పేర్కొన్నారు. దీంతో కర్నూలు న్యాయవాదులు, ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. హైకోర్టు బెంచ్ త్వరలో ఏర్పాటు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అమరావతిలో న్యాయ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. మొదటి నుంచి టీడీపీ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామంటూ స్పష్టమైన హామీ ఇచ్చింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తూ ఆర్భాటపు ప్రకటనలు చేసింది. ప్రజలను మభ్యపెడుతూ వచ్చింది. అంతే ఉత్సాహంతో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కర్నూలు నలువైపులా 20 కి.మీల దూరంలో కల్పించేలా జగన్నాథగట్టుపై హైకోర్టు ఏర్పాటు చేస్తామని ఆర్భాటపు ప్రకటనలు చేశారే తప్ప.. ఆచరణలో అడుగులు వేయలేదు. దీనికి తోడు హైకోర్టు ఏర్పాటు చేస్తామంటున్న జగన్నాథగట్టును ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు చేసి రవాణా చేస్తూ కర్నూలు గ్రావెల్ ఫీల్డ్ (కేజీఎఫ్)గా మార్చారే తప్ప.. హైకోర్టు గానీ, హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారాలోకేశ్ ప్రజాగళం పాదయాత్ర సందర్భంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వంలో కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ సేఫ్టీ శాఖ కేబినెట్ మంత్రి పదవి చేపట్టారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి కర్నూలుకు తొలిసారిగా వచ్చిన ఆయన ఆరు నెలలు, లేదా ఏడాదిలోగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసి తీరుతామని స్పష్టంగా చెప్పిన విషయం తెలిసిందే.

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యమని, కర్నూలుకు హైకోర్టు రావడం సీమ ప్రజల చిరకాల వాంఛ అని తెలిపారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు వల్ల రాయలసీమ వాసుల కోరిక తీరుతుందని అన్నారు. టీడీపీ లీగల్ సెల్ నాయకులు దాశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ కర్నూలుకు హైకోర్టు బెంచ్‌ను తీసుకురావడానికి విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు.

## గూడూరు కమిషనర్‌గా నాగరాజు

### మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల్లో భారీగా బదిలీలు

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 23:** సాధారణ బదిలీల్లో భాగంగా నగర పాలక సంస్థలో పని చేస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ బి.నాగరాజును గూడూరు నగర పంచాయితీ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న షేక్ మాలిక్‌ను కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పరిపాలన అధికారిగా నియమించారు.

● నగర పాలక సంస్థ కార్యాలయంలో నలుగురు పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను బదిలీ చేస్తూ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జే. విద్యులత ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎస్.రంగస్వామిని నందికొట్కూరు మున్సిపాలిటీకి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శశిలతను డీటీసీపీఓకు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్‌ను డోన్ మున్సిపాలిటీకి అక్కడ పని చేస్తున్న అంజాద్‌బాషాను నగర పాలకకు బదిలీ చేశారు. అనంతపురం కార్పొరేషన్ నుంచి డిప్యూటేషన్ ప్రాతిపదికన నగర పాలక సంస్థలో పని చేస్తున్న టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ పి.మంజులమ్మ డిప్యూటేషన్ రద్దు చేశారు.

#### పీఆర్ డీఈఈ, ఏఈఈల బదిలీలు

కర్నూలు జిల్లా పంచాయితీరాజ్ శాఖ విభాగంలో డీఈఈ, ఏఈఈలను బదిలీ చేస్తూ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదోని డీఈ రంగస్వామిని మంత్రాలయం, పాణ్యం డీఈ మనోహర్‌ను ఆలూరు, నందికొట్కూరు డీఈ డి.లక్ష్మీనారాయణను పత్తికొండ, పత్తికొండ డీఈ రమేష్‌కుమార్‌రెడ్డిని కర్నూలు ఈఈ టు పీఏగా, మంత్రాలయం డీఈ అశ్వత్థామను ఆదోనికి, ఈఈ టు పీఏ నాగిరెడ్డిని పాణ్యం, కోడుమూరు డీఈ మహేశ్వరరెడ్డిని పీఐయూ కర్నూలు, ఆలూరు డీఈ వై.శ్రీరాములును అనంతపురం జిల్లా ధర్మవరానికి, ఎస్ఎస్‌ఏలో పని చేస్తున్న డీఈ కర్రెన్నను కోడుమూరుకు, నంద్యాల డీఈ గంగాధర్‌ను డోన్‌కు బదిలీ చేశారు. దీంతో పాటు 34 మంది ఏఈఈలను బదిలీ చేశారు.

## నా కొడుకును ఇప్పించండి

### పోలీస్ స్టేషన్‌లో తల్లి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న తిరుమలమ్మ

**ఆలూరు, సెప్టెంబరు 23 :** 'నా కొడుకును ఇప్పించడంటూ' సోమవారం ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన పాండు, ఐదు నెలల క్రితం మిద్దె పై నుంచి పడి మృతి చెందాడు. భార్య తిరుమలమ్మ ఆమె బావ, చెల్లెలు, తోడి కోడలు పథకం ప్రకారం కొట్టి మిద్దె పై నుంచి తోసి వేశారని మృతుడి తండ్రి గోవిందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పాండు ఐదేళ్ల కుమారుడు తాతయ్య వాళ్ల దగ్గర ఉంటున్నాడు. ఈ క్రమంలోనే తన కుమారుడిని ఇప్పించాలని తల్లి తిరుమలమ్మ కోర్టును ఆశ్రయించింది. కోర్టులో కేసు నడుస్తున్నా తన కుమారుడిని ఇప్పించాలని పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతోంది. అయితే ఆ బాలుడు మాత్రం తల్లి వద్దకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. సోమవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఎస్ఐ వెంకట నరసింహులు ఆమెను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఇరు వర్గాల ఘర్షణ

### పది మందికి తీవ్ర గాయాలు



ఘర్షణలో గాయపడిన కందుకూరువాసులు

**కోసిగి, సెప్టెంబరు 23:** మద్యం తరలింపు విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. కందుకూరు, కడిదొడ్డి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు కురువ భీమేష్, బోయ వీరారెడ్డి, కడిదొడ్డి వినోద్ కుమార్‌లు కర్ణాటక మద్యం తరలింపు డాన్లుగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం కర్ణాటక మద్యం తరలించే విషయంలో కౌతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కోసిగి మండలం కందుకూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుల మధ్య కందుకూరులో తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కాకం మల్లయ్య, కాకం హనుమేష్, గుడికంబాలి హల్లయ్య, చూడి సురేష్, కాకం నాయుడులకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఈ దాడిలో కందుకూరు గ్రామానికి చెందిన కురువ భీమేష్, మజ్జిగ బోయ పెద్ద రామయ్య, చిన్న రాముడు, బోయ శివ, బోయ రాజు తలకు, చేతులకు గాయాలయ్యాయి. ఎస్ఐ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి స్టేషన్‌కు తరలించారు. గాయపడిన వారిని కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ చంద్రమోహన్ ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## కాకినాడ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

### జీజీహెచ్‌లో వైద్యుల నిరసన




నిరసన తెలుపుతున్న కర్నూలు జీజీహెచ్ వైద్యులు

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 23:** రంగరాయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డా. ఉమామహేశ్వర రావుపై దాడి చేసి కాకినాడ ఎమ్మెల్యే, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (కేఎంసీ) అధ్యక్షుడు డా.పి. బ్రహ్మాజీ మాస్టర్ డిమాండ్ చేశారు. సోమవారం దాడిని నిరసిస్తూ ఏపీజీడీఏ కర్నూలు కేఎంసీ వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎమ్మెల్యేని బర్తరఫ్ చేయాలన్నారు. ఏపీజీడీఏ రాష్ట్ర శాఖ నిర్ణయం మేరకు భవిష్యత్తులో కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీజీడీఏ కోశాధికారి డా. డమం శ్రీనివాసులు, నాయకులు డా. సోమప్ప, రామశివనాయక్, డా. రాజేష్, డా. వెంకటరమణ, డా. రామకృష్ణ నాయక్, పీడియాట్రిక్ హెచ్‌వోడీ డా.విజయానందబాబు, ఏపీఎంఎఫ్‌ఎంటీ రాష్ట్ర అధ్యక్షుడు డా. సాయి సుదీర్, మెడిసిన్ ప్రొఫెసర్ డా. రాజశేఖర్, డా. విద్యాసాగర్ పాల్గొన్నారు.

## చెట్లు నరికిన వ్యక్తులపై కేసు నమోదు

**మంత్రాలయం, సెప్టెంబరు 23:** మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో తమ స్థలంలో, మిద్దెపై ఆటంకం కలిగిస్తున్న చెట్లను నరికిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య తెలిపారు. చెట్లు నరికిన కురువ లింగప్ప, మల్లయ్య, రామచంద్ర, లింగన్న, గడ్డం భీమయ్యలపై బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు హాజరుపరిచినట్లు తెలిపారు.

## ఉల్లిగడ్డల లారీ బోల్తా

**కోసిగి, సెప్టెంబరు 23:** కోసిగి, మాలపల్లి రోడ్డులో మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన రైతు రామయ్య ఉల్లిగడ్డల పంటను ఆదోనికి చెందిన లారీ ఏపీ.02టీఈ4377లో లోడు చేసుకుని మాలపల్లి మీదుగా వెళ్తున్న సమయంలో అతివేగంతో అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడింది. అయితే ప్రమాదంలో ఎటువంటి తీవ్రగాయాలు కాకపోవడంతో రైతుకు చెందిన ఉల్లిగడ్డలకు నష్టం వాటిలిందని రైతు రామయ్య తెలిపారు. లారీ బోల్తా పడటంతో ఉల్లి సంచులు చెరిగిపోయి నేలపాలైనట్లు తెలిపాడు. మరలా వేరే లారీలో ఉల్లిగడ్డలను లోడు చేసుకుని చెన్నై మార్కెట్‌కు తరలించారు.

## హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

**ఆత్మకూరు, సెప్టెంబరు 23:** పాముల పాడు పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన హత్యకు సంబంధించిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రామాంజీనాయక్ వివరాలు వెల్లడించారు. ఎర్రగూడూరు గ్రామానికి చెందిన గుండు సిద్ధయ్య, మేకల సురేష్, సుంకేసుల అశోక్‌లు స్నేహితులు. ఈ క్రమంలోనే తన భార్యతో సురేష్ మాట్లాడుతుండటాన్ని గమనించిన సిద్ధయ్య అనుమానం పెంచుకుని భార్యతో గొడవపడ్డాడు. ఆ తర్వాత ఈ నెల 14న మధ్యాహ్న సమయంలో ముగ్గురు స్నేహితులు కలిసి కంబాలపల్లి సమీపంలోని బరక చేనుకు వెళ్లే రస్తాలోని కేసీ కెనాల్ బ్రిడ్జి వద్ద మద్యం సేవించారు. ఆ సమయంలో వివాహేతర సంబంధాలపై వారు వాగ్వివాదం చేసుకోగా చివరకు సురేష్, అశోక్‌లు ప్రణాళిక ప్రకారంతో సిద్ధయ్యను రాయితో కొట్టి బతికి ఉండగానే కేసీ కెనాల్లో వేశారు. ఆ తర్వాత ఏం తెలియనట్లుగా అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. కాగా 17వ తేదీన కొర్రప్రోలూరు హెడ్ కేసీ కెనాల్ బ్రిడ్జి వద్ద సిద్ధయ్య మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే 22వ తేదీన పోస్టుమార్టం నివేదిక రావడంతో తలకు గాయమైనట్లు గుర్తించి హత్య కేసుగా మార్చి విచారణ చేపట్టారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్‌రెడ్డి, పాములపాడు ఎస్ఐ సురేషబాబు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. సోమవారం భానుముక్కల టర్నింగ్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్సైలను డీఎస్పీ రామాంజీనాయక్ అభినందించారు.

## మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

### ఇద్దరికి తీవ్ర గాయాలు

**పాణ్యం, సెప్టెంబరు 23 :** మండలంలోని సుగాలిమెట్ట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. రుద్రవరం మండలం బీరవోలు గ్రామానికి చెందిన వెంకటయ్య, సిరివెళ్ల మండలం, ఇసుకపల్లె గ్రామానికి చెందిన సునీల్ బేతంచెర్లకు మోటారుసైకిల్‌పై వెళ్తుండగా వెనుక వైపు నుంచి తెలంగాణకు చెందిన కారు ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గాయపడ్డ ఇరువురిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

**నంద్యాల క్రైం, సెప్టెంబరు 23 :** కొడుకును కత్తితో పొడిచి దాడిచేసిన ఘటనలో నిందితుడైన తండ్రిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అస్రార్‌బాషా తెలిపారు. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఏడేళ్ల క్రితం ఉన్నత చదువులకు హైదరాబాద్‌కు వెళ్లాడు. శనివారం ఇంటికి వచ్చిన కొడుకు తనకు పెళ్లి చేయాలని, ఆస్తిని పంచాలని తండ్రి పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిని అడగడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకున్న క్రమంలో తండ్రి సుబ్బారెడ్డి, కొడుకు శ్రావణ్‌పై కత్తితో దాడిచేసి గాయపరచడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి సోమవారం సుబ్బారెడ్డిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

## 28న కవయిత్రుల జాతీయ సమ్మేళనం

**కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 23:** నగరంలోని గణేశ్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న కవయిత్రుల జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కొత్తూరు సత్యనారాయణ గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివారులోని దిన్నెదేవరపాడులోగల ఆర్టీసీ కాలనీలోని గణేశ్ సాహితీ సదన్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సావిత్రి బాయి పూలే పేరుతో నిర్వహిస్తున్నామని, ఈ సమ్మేళనానికి తెలుగు రాష్ట్రాల నుంచి కవయిత్రులు పాల్గొంటారని తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డు మాజీ ఛైర్ పర్సన్ నగరూరు శమంతకమణి అధ్యక్షతన ఈ కవయిత్రుల సమ్మేళనం జరుగుతుందని అన్నారు. ఆసక్తిగల కవయిత్రులు ఈనెల 25లోగా తమ పేర్లు వాట్సాప్ నెం. 94402 28999లో నమోదు చేసుకోవాలని గుప్త పేర్కొన్నారు.

#### విద్యార్థినులకు కవితల పోటీలు

ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల్లో ప్రజలు పడిన ఇబ్బందులు, సమస్యలపై విద్యార్థినులకు కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు సత్యనారాయణ గుప్త తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ చదువుతున్న విద్యార్థినులు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. 25 లైన్లకు మించని కవితలను ఈనెల 26తేదీలోగా సెల్ నెం. 94402 28999 వాట్సాప్‌కు పంపాలని ఆయన సూచించారు.



**YEMMIGANUR MUNICIPALITY**

**e-Procurement Tender Notice**

Tender Notice No. 9/General Fund -2024-25, Dt. 23-09-2024

| | | |
|---|---|---|
| 1 | Total No. of Work | 1st Call - 4 No's |
| 2 | Value of Work | 12.40 Lakhs |
| 3 | Bid document download starting date | 25-09-2024 at 10.30 A.M |
| 4 | Bid document download end date | 10-10-2024 at 3.00 P.M |
| 5 | Last Date & Time for receipt of Bids | 10-10-2024 at 3.30 P.M |
| 6 | Commercial Bid Opening Date | 10-10-2024 at 4.00 P.M |
| 7 | Name & Address of the Consened officer | Commissioner, Yemmiganur Municipality, Yemmiganur. Ph.No.08512-255050, Fax : 08512-228050 Email: commissioner_ygr@yahoo.com |

The details of name of work, Tender document, Eligibility Criteria. Bid Submission & Price Bid opening date and EMD details etc., may be seen on e-procurement market place available @ eprocurement.gov.in

Sd/- Sri.N.Gangi Reddy, Commissioner, Yemmiganur Municipality, Yemmiganur.

# నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

## అందరూ ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వం కృషి


ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను పంపిణీ చేస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

**పాణ్యం, సెప్టెంబరు 23 :** దేశంలో అందరికీ ఆరోగ్యం అందేలా బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా బీజేపీ ఓబీసీమోర్చా ఉపాధ్యక్షుడు మద్దిలేటి అన్నారు. స్వచ్ఛతా హీసేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక సామాజిక వైద్య కేంద్రంలో వైద్య సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను పంపిణీ చేసి గృహాలకు అంటించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రహీలా, డాక్టర్ నరేష్, డాక్టర్ మధురిమ, గంగాధర్ రెడ్డి, శ్రీనివాసయాదవ్, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, కృష్ణ, సచివాలయ సిబ్బంది ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యక్తిగత బ్రాండ్ నిర్మించుకోవాలి

**పాణ్యం, సెప్టెంబరు 23 :** విద్యార్థులు తమ సొంత నైపుణ్యంతో వ్యక్తిగత బ్రాండ్ నిర్మించుకోవాలని ఇంట్రోబోట్ ఏఐ టెకలీడ్ వసంత్ శ్రీవాత్స అన్నారు. సోమవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో నెక్సస్ స్పార్క్, డేటాసైన్స్ విభాగం ఆధ్వర్యంలో బిల్డింగ్ ఏ పర్సనల్ బ్రాండ్ యాజ్ ఏ డెవలపర్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పుస్తకాల ద్వారానే కాకుండా పలు అంశాలపై ఉన్న అధ్యయనాల ద్వారా పొందిన మేధాశక్తితో, సొంత ఏర్పాట్లతో ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సదస్సులో పలు ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నెక్సస్ స్పార్క్ వ్యవస్థాపకులు దీపక్‌శ్రీరామ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సుధీ ర్‌కుమార్, హెచ్ఓడి భాస్కరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

**నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 23:** బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికలను విధుల్లోకి తీసుకోవాలని సీఐటియూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు చెన్నయ్య, అనిల్, రమాదేవి, లీలావతి, చాందినిలతా, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

## నంద్యాల ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం రాజు


ఫొటోగ్రాపర్ల నూతన కార్యవర్గం

**నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 23:** నంద్యాల ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ ఎన్నికలు వైయస్సార్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో దాదాపు 410 మంది ఫొటోగ్రాఫర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏ,బీ ప్యానల్ అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో టాస్ వేసి అభ్యర్థులను ఎన్నుకున్నారు. బీ ప్యానల్ టాస్ గెలవడంతో బి ప్యానల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా సలీంబాషా, సెక్రటరీ ఆంజనేయులు, ట్రెజరర్‌గా రమేష్‌బాబు, కమిటీ మెంబర్స్‌గా సుభాన్,సురేష్, మహేశ్వరరెడ్డి, శివకుమార్‌రెడ్డి, మగ్బుల్‌బాషాలు గెలుపొందారు. ప్యానల్ అభ్యర్థులను నంద్యాల ఫొటోగ్రాఫర్స్ చింతలపల్లె వాసు, మురళి, ఖలీల్,శేషాద్రి తదితరులు అభినందించారు.

## లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి


పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

**నందికొట్కూరు, సెప్టెంబరు 23:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, అలాగే కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని ఏఐటియూసీ జిల్లా అధ్యక్షుడు రఘురాంమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పటేల్ సెంటర్‌లో కేజీ రోడ్డుపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిరసన వ్యక్తం చేశారు. రఘురాంమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక సంక్షేమ చట్టాలను, నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మిక హక్కులను హరించడమే అన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యాదర్శి శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజితమ్మ, ఏఐవైఎఫ్ తాలుకా కన్వీనర్ రమేష్, ఏఐటీయూసీ నాయకులు మధు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయు పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వీరన్నలు పేర్కొన్నారు. సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక కేజీరోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సురేంద్ర, శివ, ముర్తుజా, రఫీక్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడలకు కోట పాఠశాల విద్యార్థులు

**నందికొట్కూరు, సెప్టెంబరు 23:** అండర్ -17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రీడల సెలక్షన్స్‌లో చక్కటి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు బైరెడ్డి నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సలీం భాషా తెలిపారు. శనివారం కర్నూలు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్స్ లో అండర్ -17 బాలుర ఫుట్‌బాల్ లో పాఠశాల పదవ తరగతి విద్యార్థి కాటేపోగు చరణ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. చరణ్ 28 నుంచి 30 వరకు పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడలలో పాల్గొంటారని తెలిపారు. అలాగే మరో పాఠశాల పదో తరగతి విద్యార్థి ఖాజా హుస్సేన్ పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడలలో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ వెల్లడించారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

**నంద్యాల రూరల్, సెప్టెంబరు 23 :** పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ సాధ్యమని రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్వచ్ఛతాహి సేవ-2024 కార్యక్రమంలో భాగంగా వర్షపునీటి సేకరణ, సంరక్షణ కార్యక్రమంపై కళాశాలలో సదస్సు నిర్వహించారు.

**ఆత్మకూరు:** మున్సిపల్ కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్, చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా పేర్కొన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అక్రమ్ అలిఖాన్, సింధుప్రియ, సాజిదా ఫిర్దోస్, ప్రసన్నలక్ష్మి ఉన్నారు.

## కర్నూలు డీటీసీగా శాంతకుమారి

**కర్నూలు, సెప్టెంబరు 23:** కర్నూలు ఉప రవాణా కమిషనర్(డీటీసీ)గా శాంతకుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈమె ఏలూరు డీటీసీగా పని చేస్తున్నారు. కర్నూలు డీటీసీగా ఉన్న శ్రీధర్‌ను కాకినాడ డీటీసీగా బదిలీ అయ్యారు. అలాగే కర్నూలు ఆర్టీవో రమేష్‌ను రంపచోడవరం ఆర్టీవోగా బదిలీ కాగా, రాయచోటి ఆర్టీవోగా ఉన్న లాల్‌సింగ్ చౌహాన్‌ను కర్నూలు ఆర్టీవోగా నియమితులయ్యారు. కర్నూలు ఎంవీఐ మనోహర్ రెడ్డిని అనంతపురానికి బదిలీ చేశారు.

## ఆత్మకూరులో.. సమస్యలెన్నో..

**ఆత్మకూరు, సెప్టెంబరు 23:** ఆత్మకూరులో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. 2011లో ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మార్పు చెందింది. ఆ తర్వాత గ్రేడ్-3, గ్రేడ్-2 హోదాలను దక్కించుకుంది. అయితే ఆత్మకూరు పట్టణానికి గ్రేడ్-3 మున్సిపాలిటీ హోదా వచ్చినా.. ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్ప పట్టణ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా ఆత్మకూరు తలరాత మాత్రం మారడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు.


పట్టణంలో ఎక్కడ చూసినా ఇలాంటి చెత్త నిల్వలే


పట్టణంలో మురికి కాల్వల దుస్థితి

- కార్యాలయ భవన నిర్మాణానికి మోక్షమెన్నడో
- అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ
- పట్టణంలో లోపించిన పారిశుధ్యం
- కార్యాలయంలో వేధిస్తున్న ఉద్యోగుల కొరత

### ఆత్మకూరును వెంటాడుతున్న సమస్యలు ఇవే :

● పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడమే కాకుండా ఇరుగ్గా ఉండటంతో పరిపాలన నిమిత్తం కొత్త భవన నిర్మాణానికి 2013లో రూ.50లక్షల నిధులను కేటాయించారు. అయితే కొత్త కార్యాలయానికి సంతమార్కెట్‌లో, దుద్యాల రస్తాలో నిర్మించాలన్న అంశంపై పాలకవర్గంలో ఏకాభిప్రాయం కుదరలేదు. ఆతర్వాత నిర్మాణ అంచనాలు రూ.3కోట్లకు పెంచి నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ప్రస్తుతం దుద్యాల రస్తాలో స్పోర్ట్స్ అథారిటీకి చెందిన అద్దె గదుల్లోనే అరకొర సౌకర్యాల నడుమ మున్సిపల్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు.

● పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఈ నేపథ్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు గతంలో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే ఎలాంటి పురోగతి జరగలేదు. అలాగే పట్టణంలో పార్కులను ఏర్పాటు చేయలేదు. సాయిబాబానగర్‌లో ఉన్న పార్క్ ఏర్పాటు కోసం స్థల సేకరణ చేపట్టినా.. ఫలితం లేకుండా పోయింది. పట్టణంలోని అనేక వార్డుల్లో డ్రైనేజీ కాల్వలు, సీసీ రహదారులను నిర్మించాల్సి ఉంది.

●ఆత్మకూరు మున్సిపాలిటీకి సంబంధించి డంప్ యార్డు లేదు. దీంతో పట్టణ శివార్లలో ఎక్కడబడితే అక్కడ చెత్తనిల్వలు చేస్తున్నారు. గతంలో రూ.50లక్షలతో డంప్‌యార్డు ఏర్పాటు కోసం స్థలాన్ని కొనుగోలు చేసినప్పటికీ యార్డు నిర్మాణం చేపట్టలేదు. ఎక్కడ చూసినా చెత్తదిబ్బలే దర్శనమిస్తాయి.

● పట్టణంలో అనేక కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. 2014లో రూ.119కోట్లతో వెలుగోడు జలాశయం నుంచి ఆత్మకూరు పట్టణానికి నాన్ అమృత్ స్కీంకు సంబంధించి పనులను ప్రారంభించినా ఆ పనులు నేటికి మందకొడిగానే సాగుతున్నాయి.


అద్దె భవనంలో మున్సిపల్ కార్యాలయం

● మున్సిపల్ కార్యాలయంలో 33 మంది ఉద్యోగులకు గాను.. కేవలం 12 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పరిపాలన సజావుగా సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

● ఆత్మకూరు పట్టణం మీదుగా వెళ్లే గుండ్లకమ్మవాగు విస్తరణ పనులు ఐదేళ్ల క్రితమే నిలిచిపోయాయి. దీంతో భారీ వర్షాలు కురిస్తే ఏకలవ్యానగర్, రహమత్‌నగర్, లక్ష్మీనగర్, సాయిబాబానగర్, గరీబ్‌నగర్, ఇందిరానగర్ తదితర కాలనీలు నీటిముంపునకు గురికానున్నాయి.

● ఆత్మకూరు మున్సిపాలిటీ నిర్వహణలో ఐదేళ్లుగా ఇష్టారాజ్యంగా సాధారణ నిధులను దుర్వినియోగం చేసినట్లు విమర్శలు ఉన్నాయి. నిధులు వినియోగానికి సంబంధించి విచారణ చేపట్టి లోపాలు బహిర్గతమైతే బాధ్యులపై తీసుకోవాల్సి ఉంది.

● ఆత్మకూరు పట్టణంలో విచ్చలవిడిగా అక్రమ లేఅట్లను ఏర్పాటు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని విస్తరించారు. కనీసం వ్యవసాయ భూములను కన్వర్షన్ చేసుకోకుండా ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగానే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

### పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి



ఆత్మకూరు పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తాను. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న అనుభవం ఉన్నందున పట్టణాభివృద్ధిపై అవగాహన ఉంది. ప్రాధాన్యత క్రమంలో ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటాను. ప్రజలు కూడా పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆశిస్తున్నాను. పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా పనిచేస్తాను.

- రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

● నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

**కొత్తపల్లి, సెప్టెంబరు 23** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల పంట నష్టపోయిన ప్రతి రైతును తమ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం మండలంలోని దుద్యాల గ్రామ సచివాలయ ఆవరణలో సర్పంచ్ చందమాల శోభలత అధ్యక్షతన ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే సంగమేశ్వరం నుంచి జానాల వరకు గువ్వలకుంట్లలోని ఎర్రకుంట గూడెంకు రూ.50 లక్షల నిధులతో విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం

**నందికొట్కూరు రూరల్ :** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అన్నిరంగాలలో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. సోమవారం నందికొట్కూరు మండలంలోని దామగట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌ను విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కాలంలో విద్యార్థులు సెల్‌ఫోన్స్ గేమ్‌లు ఎక్కువగా మాట్లాడుతూ ఆరోగ్యం పాడుచేసుకుంటున్నారని, దీనిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని అన్నారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి సుభాన్ మాట్లాడుతూ ఈ క్రీడలు 23, 24 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రజలు మెచ్చిన 'మంచి ప్రభుత్వం': ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత


గోస్పాడులోని నెహ్రూనగరంలో...

**గడివేముల, సెప్టెంబరు 23:** 100 రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలు మెచ్చిన ప్రభుత్వం అనిపిచ్చుకుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండలంలోని బిలకలగూడురు గ్రామంలో ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో సంక్షోభాలను అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో 16,437 పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని ప్రకటించారని అన్నారు. అన్న క్యాంటిన్‌లను ఏర్పాటు చేసి పేద ప్రజలకు రూ.5లకే మూడు పూటల భోజనం పెడుతున్నారని అన్నారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులపై, వెలగమాను ఫీడర్ చానల్ నిర్మాణ ఆవశ్యకత గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించామని అన్నారు. నిధులు మంజూరు చేయించి త్వరితగతిన అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు చేపడతామని అన్నారు. అనంతరం మండలంలోని కొరటమద్ది గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త సుంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే గౌరుచరిత హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎస్‌ఏ రఫిక్, జయంత్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు పంట రామచంద్రారెడ్డి, గడివేముల మాజీ సర్పంచ్ జమాల్‌బాష, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, తహసీల్దార్ విద్యాసాగర్, మండల అధికారులు పాల్గొన్నారు.

**పగిడ్యాల:** ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయం అని ప్రత్యేకాధికారి సుభాన్ అన్నారు. మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో ఎంపీటీసీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఇది మన ప్రభుత్వం కార్యక్రమాని సోమవారం నిర్వహించారు. అనతరం ఇది మన ప్రభుత్వం పత్రాలను ఇంటింటికి వెళ్లి అతికించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, నాయకులు విజేయుడు, దర్మక్షేత్ర, హేమ సుందరరాజు, శ్రీరాములు, షరీఫ్ తదితరులు ఉన్నారు.

**నందికొట్కూరు:** ఎన్‌డీఏ ప్రభుత్వం వంద రోజుల్లో తమదైన ముద్ర వేస్తూ ప్రజాదరణ పొందుతోందని నందికొట్కూరు క్లస్టర్ ఇన్‌చార్జి లాయర్ జాకీర్ హుస్సేన్ అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని 8వ వార్డులో ఎన్.డి.ఏ ప్రభుత్వం 100 రోజుల పాలనను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ శాలిబాషా, మాజీ కౌన్సిలర్ శాలు, టీడీపీ నాయకులు రసూల్, రహంతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

**గోస్పాడు;** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలే అండ అని నెహ్రూనగర్ టీడీపీ నాయకులు వెలుకొండారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నెహ్రూనగరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాసిరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వంద రోజుల పరిపాలనపై ఇది మంచి ప్రభుత్వం పేరిట సోమవారం పట్టణంలోని కొత్తపేటలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, టీడీపీ నాయకులు గౌసలాజం, షాబుద్దిన్, కలిముల్లా, ఇబ్రహీం ఖలీలుల్లా పాల్గొన్నారు.

**మహానంది:** కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన ప్రగతి గురించి మహానంది మండలంలో టీడీపీ నాయకులు,అధికారులు కలసి కోలాహలంగా వేడుకలు నిర్వహించారు. సోమవారం మండలంలోని మసీదుపురం, గాజులపల్లి, మహానంది గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా తిరిగి ఇది మంచి ప్రభుత్వం స్టికర్లను అతికించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రమాదేవి, టీడీపీ నాయకులు గాజులపల్లి మహేశ్వరరెడ్డి, కలర్స్ రవినాథరావు, నాగేశ్వరరావు, మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.


నెహ్రూనగర్‌లో ఇది మన ప్రభుత్వం పోస్టర్లను అతికిస్తున్న అధికారులు


మహానంది: మసీదుపురంలో ఇది మంచి ప్రభుత్వం బ్రోచర్లను పంపిణీ చేస్తున్న నాయకులు


ఆత్మకూరులోని కొత్త పేటలో..

## అధికారుల బదిలీలు

**నందికొట్కూరు, సెప్టెంబరు 23:** నందికొట్కూరు పట్టణంలోని పలు శాఖల్లోని అధికారులు బదిలీలు అయ్యారు. మున్సిపాల్టీ టౌన్ ప్లానింగ్ అధికారిగా ఉన్న బాలమద్దయ్య ఆదోని మున్సిపాల్టీకి బదిలీ కాగా ఆయన స్థానంలో కర్నూలు కార్పొరేషన్ నుంచి రంగస్వామి నందికొట్కూరుకు బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్ సుచరిత గూడూరుకు బదిలీ కాగా అక్కడ విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసులు నందికొట్కూరుకు బదిలీ అయ్యారు. నందికొట్కూరు మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న రమణయ్య కడప జిల్లా బద్వేల్‌కు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో ఎమ్మిగనూరు మున్సిపాల్టీ నుంచి మహబూబ్‌బాషా నందికొట్కూరుకు బదిలీ అయ్యారు. నందికొట్కూరు మున్సిపాల్టీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సృహత ఎమ్మిగనూరుకు బదిలీ కాగా గూడూరులో పని చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి నందికొట్కూరుకు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా మున్సిపాల్టీలో విధులు నిర్వహిస్తున్న దాదాపు మొత్తం సిబ్బంది బదిలీ అయ్యారు. ఇటీవలే కొత్తగా బేబికమిషనర్ రాగా... ఆర్వో విజయలక్ష్మి గూడూరుకు బదిలీ కాగా ఆమె స్థానంలో మధుసూదన్‌బాబు విధుల్లో చేరారు.

● నందికొట్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ చంద్రమౌ లి, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో సబ్ రిజిస్ట్రార్‌గా మౌలాలి, సీనియర్ అసిస్టెంట్‌గా మంజుల, జూనియర్ అసిస్టెంట్లుగా మౌలాలి, ప్రసాద్, అటెండర్‌గా పద్మావతిలను బదిలీ చేస్తూ కర్నూలు ఆర్‌డీడీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## వీఆర్వోల బదిలీ

**కొత్తపల్లి, సెప్టెంబరు 23:** కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ రెవెన్యూ అధికారులను నంద్యాల జిల్లా కలెక్టర్ బదిలీ చేసినట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. సోమవారం ఆమె తెలిపిన వివరాల మేరకు దుద్యాల వీఆర్వో శ్రీనివాసులును గోకవరానికి బదిలీ చేయగా.. కొత్తపల్లి వీఆర్వో లింగస్వామిని దుద్యాలకు బదిలీ అయ్యారు. అలాగే శివపురం వీఆర్వో బాబుమియ్యాను కొత్తపల్లికి గుమ్మడాపురం వీఆర్వో నరసింహను సున్నిపెంటకు, ఎర్రమటం వీఆర్వో మౌలాలిని గుమ్మడాపురం బదిలీ చేశారు. నందికొట్కూరు వీఆర్వో రషీదును ఎర్రమటంకు, గోకవరం వీఆర్వో అశోక్‌ను ఎదురుపాడుకు బదిలీ అయ్యారు. ఎదురుపాడు వీఆర్వో రహీంను తంగడంచ గ్రామానికి బదిలీ కాగా, నందికుంట, గువ్వలకుట్ల, ముసలిమడుగు, కొక్కెరంచ వీఆర్వోలు మాత్రం వారి స్థానాల్లో వారికే కేటాయించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

## దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ


ట్రైసెకిళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 23:** ఇటీవల నిర్వహించిన పిజిఆర్ఎస్ వేదికలో దివ్యాంగులైన బండి ఆత్మకూరుకు చెందిన రమణారెడ్డి, మిట్నాల గ్రామానికి చెందిన వేణుగోపాల్‌లు కలెక్టర్‌కు ట్రైసైకిళ్లకోసం అర్జీలు పెట్టుకున్నారు. కలెక్టర్ స్పందిస్తూ ట్రైసైకిళ్ల పంపిణీకి చర్యలు తీసుకుంటూ..నేటి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులైన దివ్యాంగులకు ట్రైసైకిళ్లను కలెక్టర్ రాజకుమారి పంపిణీచేశారు.

## ఘనంగా నందీశ్వరుడి పల్లకి సేవ


మహానందిలో పల్లకి సేవకు ఉత్సవ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

**మహానంది, సెప్టెంబరు 23:** మహానందిలో సోమవారం పల్లకిసేవ ఉత్సవాన్ని వేదపండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. నందీశ్వరుడు, కామేశ్వరీ దేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కూరగాయాల దాత లక్కబోయిన ప్రసాద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా వెండి రథోత్సవం


రథాన్ని లాగుతున్న అర్చకులు

**శ్రీశైలం, సెప్టెంబరు 23:** శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఊరేగించారు.

● శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో సోమవారం సికిందరాబాద్‌కు చెందిన కీర్తి ఆర్ట్స్ అకాడమీ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, శివతాండవం, కాలభైరవాష్టకం, నమఃశివాయతే, శివలీలలు, ఈశ్వరా పరమేశ్వరా తదితర గీతాలకు ప్రశాంతి, హర్షిక, సుచిత, స్వాతి, కీర్తి, అక్షయ తదితరులు నృత్యప్రదర్శనతో అలరించారు.

## పట్టణ స్వచ్ఛతే లక్ష్యం



మున్సిపల్ కార్మికులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

**నందికొట్కూరు, సెప్టెంబరు 23:** నందికొట్కూరు పట్టణ పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా పని చేస్తామని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని జైకిసాన్ పార్కులో మున్సిపల్ కమిషనర్ బేబి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చాంద్‌బాష, అబ్దుల్ రావూఫ్, నందికొట్కూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాంబాబు, హెడ్ నర్సు భువనేశ్వరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు మీనాక్షి, టీడీపీ నాయకులు, నందికొట్కూరు, మిడ్తూరు ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉర్దూ భాషాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది


టెట్ ఉర్దూ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎన్‌ఎండీ ఫిరోజ్

**నంద్యాల రూరల్, సెప్టెంబరు 23 :** రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి, ఉర్దూ విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండి ఫిరోజ్ అన్నారు. జోయా ఉర్దూ కోచింగ్ డైరెక్టర్ అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్, మైనార్టీ సంక్షేమ శాఖ ప్రచురితమైన టెట్-2024 ఉర్దూ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ఎన్‌ఎండి ఫిరోజ్ హాజరై అభ్యర్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హఫీజ్ అంజాద్‌బాషా, అయమ్మ, అబ్దుల్‌సత్తార్, అబ్దుల్ అజీజ్, షమీమ్‌బాను తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి

- సీఐ ఇంతియాజ్ బాషా


డోన్ రైల్వే స్టేషన్ ప్రధాన రోడ్డును పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

**డోన్(రూరల్), సెప్టెంబరు 23:** పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా కోరారు. సోమవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రధాన రోడ్డులో పెయింటింగ్ లైన్స్‌ను ఏర్పాటు చేశారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసుల పర్యవేక్షణలో ట్రాఫిక్ నియంత్రణకు పట్టణ పోలీసులు దశలవారిగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్ రోడ్డు ప్రధాన రోడ్డు మధ్యలో పెయింటింగ్ లైన్స్ వేసి వాహనదారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న ఎంఈవో అనూరాధ

**చాగలమర్రి, సెప్టెంబరు 23:** యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంఈవో అనూరాధ అన్నారు. సోమవారం చాగలమర్రి గ్రామంలో జిల్లాపరిషత్ బాలికల పాఠశాల బాలికలు, హెచ్ఎం విజయలక్ష్మి, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో అనూరాధ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం అంధకారం అవుతుందన్నారు. చెడు వ్యసనాలకు స్వస్తి పలికి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, సాయిసుదర్శన్, రఫీ, మహబూబ్ బాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గొడవలు సృష్టిస్తే చర్యలు


ఇటిక్యాలలో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

**కొలిమిగుండ్ల, సెప్టెంబరు 23 :** ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఇటిక్యాల, చింతలాయపల్లె, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. గ్రామంలో పోలీసులు కవాత్ నిర్వహించారు. చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు.

## సోంపురం రోడ్డు సమస్య పరిష్కరించాలి

**డోన్(రూరల్), సెప్టెంబరు 23:** సోంపురం గ్రామం మీదుగా రాకపోకలు సాగించడానికి ఉన్న ఏకైక బీటీ రోడ్డు సమస్య పరిష్కరించాలని సోంపురం గ్రామ ప్రజలు కోరారు. సోమవారం సర్పంచ్ రాధమ్మ ఆధ్వర్యంలో గ్రామ పెద్ద వేమారెడ్డి, గ్రామస్థులు పెద్ద సుంకన్న, ఆటో మారెన్న, రాముడు, రామలక్ష్మి తదితరులు డోన్ తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ సోంపురం గ్రామం ఏర్పడినప్పటి నుంచి రాకపోకలు సాగించడానికి ఒకటే రస్తా ఉందన్నారు. 15 ఏళ్ల క్రితం బీటీ రోడ్డు వేశారన్నారు. ప్రస్తుతం ఓ రైతు తన పొలంలోని కొంత భూభాగం బీటీ రోడ్డు రస్తాలో కలిసిందని కోర్టును ఆశ్రయించారని తెలిపారు. గ్రామానికి వేరే రస్తా లేకపోవడంతో సమస్యను పరిష్కరించి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్థులు కోరారు.

## చివరి ఆయకట్టుకు సాగు నీరు

**చాగలమర్రి, సెప్టెంబరు 23:** టీజీపీ ప్రధాన కాలువ ద్వారా చివరి ఆయకట్టుకు సాగ ునీరు అందిస్తున్నామని నంద్యాల జిల్లా టీజీపీ ఈఈ శివశంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం టీజీపీ ప్రధాన కాలువ 58 కి.మీ నుంచి 96 కి.మీ వరకు కడప జిల్లా పోరుమామిళ్ల టీజీపీ ఈఈ కృష్ణారెడ్డితో కలిసి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. నంద్యాల జిల్లా కడప జిల్లా సరిహద్దు వద్ద గల టీజీపీ గేట్లను పరిశీలించారు. ఆయన వెంట టీజీపీ డీఈ వెంకటరమణ, ఏఈలు మహమ్మద్‌సలీమ్, నియాజ్‌అహ్మద్, వినయ్‌కుమార్, మోహన్ కృష్ణారెడ్డి, పోరుమామిళ్ల డివిజన్ ఏఈలు నాగిరెడ్డి, రామమోహన్ ఉన్నారు.

## భగ్గుమన్న కార్మిక సంఘాలు

**డోన్(రూరల్), సెప్టెంబరు 23:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాలపై కార్మిక సంఘాలు భగ్గుమన్నాయి. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పాతబస్టాండులో కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు పుల్లయ్య, అబ్బాస్, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులైఖ, సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణలు కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను, నాలుగు చట్టాలుగా మార్చి కార్మికులకు తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు.

- **సీఐటీయూ ఆధ్వర్యంలో..**

కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బేతంచెర్ల రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం, పట్టణ అధ్యక్షులు నక్కి శ్రీకాంత్, రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగమద్దయ్య పాల్గొన్నారు.

## బేతంచెర్ల కమిషనర్‌గా హరిప్రసాద్

**బేతంచెర్ల, సెప్టెంబరు 23:** నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా హరిప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబును ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించి కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధికి, కౌన్సిలర్లు, ప్రజలు సహకరించాలని కోరారు.



## ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఐ

**ప్యాపిలి, సెప్టెంబరు 23:** పట్టణ ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ మధుసూదన్ సోమవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మురళి ఉన్నారు.

## వర్షం కోసం పూజలు

**ప్యాపిలి, సెప్టెంబరు 23:** మండలంలోని రాచెర్ల గ్రామంలో సోమవారం శివాలయంలో వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివుడికి పూజలు చేస్తే వర్షం వస్తుందని ఇక్కడి ప్రజల విశ్వాసం. కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు అండగా నిలుద్దాం

- **ఎమ్మెల్యే కోట్ల ఆధ్వర్యంలో విరాళాల సేకరణ**


వరద బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

**డోన్, సెప్టెంబరు 23:** విజయవాడ వరద బాధితులకు అండగా నిలుద్దామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే కోట్ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. విజయవాడ వరద బాధితుల కోసం విరాళాలను సేకరించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు తరుపున చిగురుమానుపేట, కొండపేటల నుంచి రూ.ఐదు లక్షల విరాళాన్ని ప్రకటించారు. సాయిశ్రీ విద్యా సంస్థల అధినేత మర్రి రమణ రూ.50వేలు, టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి రూ.25వేలు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు రూ.25వేలు విరాళాలను ప్రకటించారు. అదేవిధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ వంతుగా విరాళాలు ప్రకటించారు. ఎమ్మెల్యే కోట్ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వరద బాధితులకు రూ.10 లక్షల పైనే విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్య గౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ఓం ప్రకాష్, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**బేతంచెర్ల:** పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బైటిపేట సమీపంలో ఉన్న కొలుములపల్లె ట్యాంకు వద్ద టీడీపీ అధికారంలోకి వచ్చి వందరోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలోని ప్రజలు తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ గ్రిడ్ ద్వారా ఇప్పటికి రూ.120 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇంకా రూ.300 కోట్లు ఖర్చు చేస్తే ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటు చేసి కొత్త ఏడాది జనవరిలో తాగునీటి సరఫరా చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్ గల నాయకుడు అని డోన్, ప్యాణ్యంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం రూ.450 కోట్లతో పరిశ్రమలు రానున్నాయని అన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రజల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను గురించి వివరించారు. సమావేశంలో మెప్మా సీఈవో శ్రీదేవి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, కమిషనర్ హరిప్రసాద్, టీడీపీ నాయకులు ఉన్నం చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, ఉన్నం సుధాకర్, గోరీ వెంకట్రామిరెడ్డి, భీమేశ్వరరెడ్డి, రవీంద్ర నాయక్, ఐ.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు రామగోపాల్, రామాంజనేయులు, వలి, సయ్యద్, అహ్మద్ పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం

- **ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**శిరివెళ్ల, సెప్టెంబరు 23 :** రాష్ట్రంలోని ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని టీడీపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ శిరివెళ్లలో సోమవారం పర్యటించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని షాదీఖానా భవనంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే అఖిలప్రియ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైసీపీ చేసిన అరాచకాలు, దౌర్జన్యాలను సహించలేని ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారన్నారు. రాష్ట్రంలో సంక్షోభం నెలకొన్నప్పటికీ పింఛన్ల పెంపు, ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ, పంచాయతీలకు నిధులు సమకూర్చిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. శిరివెళ్ల ప్రజల ప్రయోజనార్థం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయం అన్నారు. అనంతరం విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. నాలుగులక్షల చెక్కును మండలంలోని పొదుపు సంఘాల మహిళలు ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ సుబ్రమణ్యం, తహసీల్దార్ పుష్పకుమారి, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, యామా గుర్రప్ప, సూరా రామ, బీసీ ఖాజా హుసేన్, బీసీ ఫిదా హుసేన్, ఉల్లి వెంకట సుబ్బయ్య, పీపీ లింగమయ్య, యామా శ్రీనివాసులు, బీఎండీ రఫీ, శ్రీకాంత్, బాలచంద్రుడు, సిద్ధిఖ్, కరీం పాల్గొన్నారు.

# విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు


వెంకటనాయునిపల్లెలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు, ఉద్యోగులు


సిమెంటునగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**డోన్(రూరల్), సెప్టెంబరు 23:** విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు అని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. సోమవారం వెంకటనాయునిపల్లె గ్రామంలో టీడీపీ వంద రోజుల పాలనపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కొలిమిగుండ్ల :** మండల పరిధిలోని కల్వటాల గ్రామంలో సర్పంచ్ కామిని సుమలత, కామిని క్రిష్ణరంగారెడ్డి వందరోజుల పాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు పేట్నీకోట హుసేన్‌రెడ్డి, కామిని భాస్కరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే పేట్నీకోటలో హుసేన్‌రెడ్డి, సత్యారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, బెలుం గ్రామంలో పోతిరెడ్డి రాఘవరెడ్డి, టపాల్ హుశేని, అహ్మద్, ఇటిక్యాలలో తోట శివారెడ్డి, నందిపాడులో లోకనాథ్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శంకరరెడ్డి, మీర్జాపురం గ్రామంలో పోరెడ్డి చిన్నపురెడ్డి, శ్రీరాముడు, రంగస్వామి, విష్ణు, ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు మంచి ప్రభుత్వంపై ప్రచారం చేశారు.

**చాగలమర్రి:** రాష్ట్రంలో టీడీపీ, కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన సాధ్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, బీసీ సెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు అన్నారు. సోమవారం చాగలమర్రి గ్రామంలోని సంతమార్కెట్, కోటగడ్డ వీధుల్లో ఇది ప్రజాప్రభుత్వం కరపత్రాలతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహుడు, మౌలాలి, జెట్టి నాగరాజు, అబ్దుల్‌ఖాదర్, గఫార్, ఓబులేసు, ధనుంజయుడు, మురళీ, నాగూర్‌వలి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

**ఉయ్యాలవాడ:** సీఎం చంద్రబాబు పరిపాలన భేష్‌గా ఉందని టీడీపీ మండల నాయకుడు గాండ్ల పుల్లయ్య అన్నారు. సోమవారం కాకరవాడ గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాష, దస్తగిరి, ఉద్యోగులు ఉన్నారు.

**దొర్నిపాడు:** మండలంలోని చాకరాజువేముల, గుండుపాపల గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్ర, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు లింగుట్ల వెంకట్ నాయుడు, గంగవరం కృష్ణారెడ్డి, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, ఎండూరి గోపాల్‌నాయుడు, మహేష్, భూమా ప్రతాప్‌రెడ్డి, బూషిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

**బేతంచెర్ల:** మండల పరిధిలోని సిమెంట్‌నగర్‌లో టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాముడు ఆధ్వర్యంలో మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ కరపత్రాలను, స్టిక్కర్లను అందించారు. కార్యక్రమంలో ఉరుకుందు, వాసు, వెంకటేశ్వర్లు, రామసుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సంజామల:** మండల పరిధిలోని ముదిగేడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూర్యవర్ధన్ రెడ్డి, బారె ఇమామ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**రుద్రవరం :** మండల పరిధిలోని చిత్తరేణిపల్లె గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లను కూటమి నాయకులు సంజీవరాయుడు, మల్లయ్య ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శివక్రిష్ణ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక పరిశీలన


శ్మశాన వాటిక భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లికార్జున రెడ్డి

**సంజామల, సెప్టెంబరు 23:** మండల కేంద్రంలో వివాదాస్పదంగా మారిన శ్మశాన వాటిక ను నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి సోమవారం పరిశీలించారు. గ్రామంలోని 267 సర్వే నెంబరులో దళితులు కొంత భూమిని శ్మశాన వాటికగా ఉపయోగించుకునే వారు. కొన్నేళ్లుగా ఆ భూమి యజమాని అడ్డు చెప్పడంతో దళితులు మృతదేహాలను పూడ్చడంలో ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో సంజామలకు చెందిన దళితులు సోమవారం నంద్యాల కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, తహసీల్దార్ అనిల్ కుమార్ స్థలాన్ని పరిశీలించారు. సర్వే యర్లు జ్ఞానప్రకాష్, క్రిష్ణయ్యద్వారా భూ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమం లో ఏఎస్ఐ నాగరాజు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది, దళితులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన కలెక్టరు

**రుద్రవరం, సెప్టెంబరు 23:** ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన ఆదర్శ పాఠశాల పూర్వవిద్యార్థులను సోమవారం కలెక్టర్ రాజకుమారి గనియా అభినందించారు. బిందు, ఛాయాదేవి, లోకేశ్, పూజిత, శరత్ అనే ఐదుగురు విద్యార్థులకు కర్నూలు, కడప, అనంతపురం, నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లు సాధించారు. ఉన్నత స్థాయికి ఎదిగి నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి, ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## డోన్-గోరుమానుకొండ బస్సు సర్వీసు ప్రారంభం

**బేతంచెర్ల, సెప్టెంబరు 23:** మండలంలోని గోరుమానుకొండకు డోన్ బస్సు సర్వీసును సోమవారం ప్రారంభించారు. గతంలో బనగానపల్లె ఆర్టీసీ డిపో నుంచి గోరుమానుకొండకు ఉన్న సర్వీసు రద్దు చేయడంతో విద్యార్థులు, గ్రామ ప్రజలు బేతంచెర్ల, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో మోడల్ స్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలకృష్ణ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. డిపో ఉన్నతాధికారులు డోన్-గోరుమానుకొండ బస్సు సర్వీసు ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు, గ్రామ ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు.

## ఫారెస్టు శాఖలో పదోన్నతులు, బదిలీలు

**రుద్రవరం, సెప్టెంబరు 23 :** ఫారెస్టు శాఖలో రుద్రవరం, చెలిమరేంజ్‌లలో పనిచేస్తున్న బీట్ ఆఫీసర్లుకు సెక్షన్ ఆఫీసర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఫారెస్టుశాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటరు రామక్రిష్ణ ఉత్తర్వులు జారీ చేసినట్లు రేంజర్ శ్రీపతినాయుడు సోమవారం తెలిపారు. పి.మహబూబ్‌ఖాన్ రుద్రవరం, రామక్రిష్ణ జీవీ పెంట సెక్షన్, వై.నాగేంద్రయ్య నంద్యాల మొబైల్ పార్టీకి, రామేశ్వరి బండి ఆత్మకూరు రేంజ్ ఓంకారం సెక్షన్‌కు విజయవర్ధన్ చెలిమ సెక్షన్ ఆఫీసరుగా పదోన్నతులు కల్పించి బదిలీ చేశారన్నారు. రుద్రవరం రేంజ్‌లోని ఊట్ల బీట్ ఆఫీసరుగా ఎం.సరస్వతి, నూతల సౌత్ బీట్ ఆఫీసరుగా ఓ.నరసింహారెడ్డిని నియమించారు. రుద్రవరం సెక్షన్ ఆఫీసరుగా పనిచేస్తున్న నాగరాజును బండి ఆత్మకూరు రేంజ్ జీసీపాలెం సెక్షన్‌కు బదిలీ చేసినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు.

## డోన్ మండలంలో వీఆర్వోల బదిలీలు

**డోన్, సెప్టెంబరు 23:** డోన్ మండలంలో పలువురు వీఆర్వోలను బదిలీ చేస్తూ కలెక్టర్ రాజకుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని కమలాపురం వీఆర్వోగా హనుమన్న, మల్కాపురం వీఆర్వో తిమ్మప్ప, కొచ్చెర్వు వీఆర్వో-1గా వెంకట్రాముడు, కొచ్చెర్వు-2 వీఆర్వోగా మాధవస్వామి, ఉంగరానిగుండ్ల వీఆర్వోగా కృష్ణమూర్తి, కొత్తకోట వీఆర్వోగా పెద్దయ్య, కామగానిగుండ్ల వీఆర్వోగా భాస్కర్ నాయుడు, యు.కొత్తపల్లి వీఆర్వోగా గోవిందు, చనుగొండ్ల వీఆర్వోగా మోహన్‌రావు, దొరపల్లి వీఆర్వోగా మధుమహేష్, ఉడుములపాడు వీఆర్వోగా లాలెప్ప, ఎద్దుపెంట వీఆర్వోగా శ్యాంసుందర్‌రావు, వెంకటాపురం-1 వీఆర్వోగా రామాంజనేయులు, వెంకటాపురం వీఆర్వో-2గా మహానంది, డోన్ పట్టణంలోని కేవీఆర్ నగర్ సచివాలయ వీఆర్వోగా అబ్దుల్ రజాక్, పాతపేట సచివాలయం వీఆర్వోగా సత్యనారాయణ స్వామిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డోన్ మండలంలో పని చేస్తున్న సునీల్‌ను ప్యాపిలి మండలంలోని జలదుర్గం వీఆర్వోగా, దొరపల్లి వీఆర్వోగా పని చేస్తున్న రాజు.. కల్లూరు మండలంలోని పెద్దటే కూరు వీఆర్వోగా, కామగానిగుంట్ల పని చేస్తున్న వీఆర్వో ఖాజాను రుద్రవరం మండలానికి, చనుగొండ్ల వీఆర్వోగా పని చేస్తున్న సూరిబాబును ప్యాపిలి మండలంలోని చంద్రపల్లి వీఆర్వోగా బదిలీ చేశారు.

## భవిష్యత్తు తరాలకు పచ్చదనాన్ని అందిద్దాం

**రుద్రవరం, సెప్టెంబరు 23 :** పచ్చదనం ముద్దు ప్లాస్టిక్ వద్దని ఫారెస్టు రేంజ్ ఆఫీసరు శ్రీపతినాయుడు అన్నారు. సోమవారం ఫారెస్టు కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి భవిష్యత్ తరాల వారికి పర్యావరణం పచ్చదనాన్ని అందిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసరు ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసరు ముక్తర్ బాషా, శ్రీనివాసరెడ్డి, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## చాగలమర్రిలో వర్షం

- తడిసిన మొక్కజొన్న

**చాగలమర్రి, సెప్టెంబరు 23:** చాగలమర్రి మండలంలో సోమవారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. ఆయా గ్రామాల రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం తడిసింది. కొందరు రైతులు ముందస్తుగా ప్లాస్టిక్ కవర్లు కప్పుకున్నారు. తడిచిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకున్నారు. వర్షంతో ధాన్యం దెబ్బతిన్నడంతో నష్టపోయామని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో వరి, మినుము, కంది, పసుపు తదితర పంటలకు జీవం పోసినట్లైందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

## వరద నీటితో పొంగిపొర్లిన రాజోలి ఆనకట్ట


రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

**చాగలమర్రి, సెప్టెంబరు 23:** మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది సోమవారం పొంగి ప్రవహించింది. ఎగువ నుంచి వరద నీరు రావడం వల్ల కుందూ ఉధృతి పెరిగిందని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ప్రస్తుతం కుందూలో 11 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అన్నారు. కేసీ ప్రధాన కాలువలో 750 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అన్నారు. మరో రెండు రోజుల్లో కుందూ నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అన్నారు. పరిసర గ్రామాల రైతులు, కూలీలు నది దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు.

## వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి

**కొలిమిగుండ్ల, సెప్టెంబరు 23 :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గొర్రెల కాపరులు గొర్రెలు, మేకలకు వేసే వ్యాధి నిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలని కొలిమిగుండ్ల పశువైద్యశాల డాక్టర్ పద్మావతి కోరారు. ప్రస్తుతం గొర్రెలు, మేకల్లో వచ్చే పారుడు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని, కాపరులు తమ మందలకు వేయించాలని సూచించారు.

## గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

**ఉయ్యాలవాడ, సెప్టెంబరు 23:** మండలంలోని మాయలూరు ప్రాథమిక వైద్యశాలలో గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు చేయించామని ఎంపీ డీవో ఉమమహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో భాగంగా వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుగానే బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేయిస్తున్నామన్నారు. మండలంలో 45 మంది గ్రీన్ అంబాసిడర్లకు పరీక్షలు చేయించామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేంధర్‌రెడ్డి, టెక్నీషియన్ సుబ్బారెడ్డి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

**చాగలమర్రి, సెప్టెంబరు 23:** పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ అన్నారు. సోమవారం చాగలమర్రి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల పారిశుధ్య కార్మికులకు, హరిత రాయబారులకు వైద్యపరీక్షలను వైద్యులు అంజలి ఆధ్వర్యంలో నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు ఈసీజీ, రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈ వెంకటమ్మ, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఏపీవో నిర్మల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఎంపీహెచ్ఏ మనోహర్, ఎల్‌టీ నాయక్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 25 మెట్రిక్ టన్నుల దాణ మంజూరు

**ఉయ్యాలవాడ, సెప్టెం బరు 23:** మండలంలోని ఆయా గ్రామాలకు 25 మెట్రి క్ టన్నుల దాణ మంజూరు అయినట్లు పశు వైద్యాధికారి శైలజ తెలిపారు. సోమవారం సబ్సిడీ టీఎమ్మార్ దాణ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 200 కేజీల యూనిట్ గల దాణ పూర్తి ధర రూ. 3,160 కాగా, ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు కేవలం రూ. 1,300 అందిస్తుందన్నారు. ఒక్కో రైతుకు అధికంగా ఎనిమిది యూనిట్లు మాత్రమే ఇస్తామన్నారు. రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలు లేదా పశువైద్యశాలల్లో సంప్రదించాలన్నారు.

## నేడు ఎమ్మెల్యే అఖిల ప్రియ రాక

**ఉయ్యాలవాడ, సెప్టెంబరు 23:** మండలంలోని ఉయ్యాలవాడకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంగళవారం వస్తున్నట్లు ఎంపీడీవో ఉమ మహేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం మండలకేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాని ఆయన కోరారు.

## రేపు ఎమ్మెల్యే కోట్ల రాక

**ప్యాపిలి, సెప్టెంబరు 23:** మండలంలోని బూరుగుల గ్రామానికి బుధవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి రానునన్నట్లు ఎంపీడీవో ఫజుల్‌రహిమాన్ సోమవారం తెలిపారు. గ్రామంలో నిర్వహించే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి వితరణ

**బేతంచెర్ల, సెప్టెంబరు 23:** పట్టణంలోని శేషారెడ్డి కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రికి ఆరు సెలెన్ స్టాండ్లు, స్ట్రక్చర్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సాగరిక, డాక్టర్ చరణ్ రాజులకు సోమవారం వితరణ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరారెడ్డి, సభ్యులు గణేష్ రెడ్డి, దాతలు కుమార్, టిఫిన్ కుమార్, లోకేశ్వర్ గుప్త, సత్తార్ రామ్మూర్తి, వీరభద్రారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

**డోన్, సెప్టెంబరు 23:** టీడీపీ డోన్ యువ నాయకుడు ధర్మవరం భరత్ రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ యూత్ నాయకులు బీఎడ్ భాషా, పార్థసారధిరెడ్డి, ప్రసాద్, తేజా నాయుడు, వలి, బ్రహ్మం, అర్జున్, మహేష్ పాల్గొన్నారు.

## గర్భిణులకు అన్నదానం

**బేతంచెర్ల, సెప్టెంబరు 23:** పట్టణంలోని శేషారెడ్డి కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో కుప్ప శ్రీనివాసులు సహకారంతో గర్భిణులకు, రోగులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురా మధు సుధాకర్ రెడ్డి, సభ్యులు చంద్రశేఖర్ కృష్ణారెడద్ది, మనోహర్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

## నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

**అవుకు, సెప్టెంబరు 23 :** మండలంలోని రైతులు 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ నెల 24నుంచి ప్రారంభమయ్యే పొలం పిలుస్తుంది కార్యక్రమం డిసెంబరు నెల 31 వరకు కొనసాగుతుందన్నారు. ఈనెల 24న సంగపట్నం, చనుగొండ్ల, 25న రామాపురం, చెర్లోపల్లె గ్రామాల్లో రైతులతో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## స్వర్ణాంధ్రను సాధించడమే సీఎం లక్ష్యం

**రుద్రవరం, సెప్టెంబరు 23 :** ఏపీ భవిష్యత్తు కోసం ప్రతిష్టాత్మకమైన స్వర్ణాంధ్ర 2047ను సాధించడమే ఏపీ సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని ఎంపీడీవో మధుసూదనరెడ్డి, హౌసింగ్ ఏఈ నాగరాజు అన్నారు. విజన్ 2047 పై సోమవారం మండల పరిషత్ కార్యాయంలో గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో వ్యూహాత్మకంగా కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## కమిషనర్‌కు వీడ్కోలు సన్మానం

**డోన్, సెప్టెంబరు 23:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం బదిలీపై వెళ్తున్న కమిషనర్ జయరాంను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్లు కోట్రికే హరికిషన్, జాకీర్‌హుశేన్, కౌన్సిలర్లు కమిషనర్ జయరాంను సన్మానించి వీడ్కోలు పలికారు. డోన్ కమిషనర్‌గా ప్రసాద్‌గౌడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.